




నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థిసంఘాల నాయకులు

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అనంతపురంలోని నారాయణ కళాశాల విద్యార్థి ఆత్మహత్యపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా విద్యార్థిసంఘాల నాయకులు కొత్తచెరువు మండల కేంద్రంలో మోకాళ్లపై నిల్చొని నిరసన చేపట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అనంతపురం నగరంలో నారాయణ విద్యాసంస్థలలో ఫీజుల వేధింపుల కారణంగా ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి మరణిస్తే ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం దారుణమన్నారు. వెంటనే నారాయణ విద్యాసంస్థల యాజమాన్యాల పైన కేసు నమోదు చేసి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై విద్యార్థి సంఘాలు గత వారం రోజుల నుంచి ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ జిల్లాలో ఉన్న విద్యాశాఖ అధికారులు, పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణ కళాశాల దగ్గర విద్యార్థి సంఘాలు ఆందోళన కార్యక్రమం చేపడితే విద్యార్థి నాయకులను అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయించారన్నారు. విద్యార్థి మరణానికి కారణమైన నారాయణ కళాశాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలు బందును విజయవంతం చేసిన విద్యార్థి సంఘం నాయకులకు సహకరించిన విద్యార్థులకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పోతులయ్య, జగదీష్, వైయస్సార్ఎస్‌యు జిల్లా అధ్యక్షులు పురుషోత్తం, అమర్నాథరెడ్డి. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, బుక్కపట్నం మండల కార్యదర్శి ఎస్ విష్ణువర్ధన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు హరిప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి సాయి గౌతమ్, పుట్టపర్తి మండల కార్యదర్శి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మలమ్మా.. ఈసారైనా కరుణించమ్మా..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

- నేడు కేంద్ర బడ్జెట్
- కేటాయింపులపై ఉమ్మడి జిల్లా వాసుల ఎదురుచూపు
- వెనుకబడిన ప్రాంతానికి ప్రాధాన్యత దక్కేనా ..!

కేంద్ర బడ్జెట్‌లో ఈసారైనా వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు ప్రాధాన్యత లభిస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది. 2025-26 బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో శనివారం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 2024-25కు సంబంధించి సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మొదట ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అనంతరం ఎన్నికల తరువాత జులైలో తక్కిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఎన్నికల ముందు... తరువాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ వెనుకబడిన అనంతపురం జిల్లాకు కేటాయింపులేవీ లేవనే చెప్పవచ్చు. ఇప్పుడు ప్రవేశపెట్టే పూర్తి స్థాయి బడ్జెట్‌లోనైనా ఉమ్మడి అనంతపురం జిల్లాకు నిధులు కేటాయింపులు జరిగేనా అన్నది చూడాల్సి ఉంది.

నత్తనడకన సాగుతున్న కేంద్రీయ విశ్వవిద్యాలయం

విభజన హామీల్లో ఒకటైనా కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధుల కేటాయింపులు మొక్కుబడిగా ఉంటూ వస్తున్నాయి. దీంతో విశ్వవిద్యాలయం ఏర్పాటు పనులు కూడా నత్తనడకనే సాగుతూ వస్తున్నాయి. 2018లో ఇక్కడ ప్రారంభమయితే ఈ ఏడాదే తరగతి గదులు అక్కడ ప్రారంభమయ్యాయి. మొదటి దశ మాత్రమే పూర్తయింది. ఇంకా రెండు దశల్లో పనులు చేపట్టాల్సి ఉంది. అక్కడ సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయి. పూర్తి స్థాయి క్యాంపస్ ఏర్పాటుకు అవసరమైన నిధులు కేటాయించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

శంకుస్థాపన వరకే 'బెల్'

విభజన హామీల్లో వచ్చిన నాసన్ గతేడాది ప్రారంభమైంది. అక్కడ కూడా ఇంకా పూర్తి స్థాయి పనులు పూర్తవలేదు. పనులైతే నడుస్తున్నాయి. ఇక పక్కనేవున్న బెల్ మాత్రం శంకుస్థాపనకే పరిమితం అయింది. పని ప్రహరీ నిర్మాణం వద్దనే ఆగింది. ఈసారైనా వాటి వేగవంతం చేసే చర్యలు తీసుకుంటారో లేదో చూడాల్సి ఉంది.

వెనుకబడిన ప్రాంతాలాకు ప్యాకేజీ ?

రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ కింద ఇస్తామన్న నిధులు ఆగిపోయాయి. బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని జిల్లాకు కేటాయించాలని జిల్లావాసులు చాలాకాలంగా కోరుతున్నారు. బిజెపి కూడా వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి పేరుతో రాయలసీమ డిక్లరేషన్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఈ ప్రాంతానికి నిధుల కోసం ఏ మేరకు ప్రయత్నాలు జరిగాయన్నది నేడు తేలనుంది.అదే విధంగా రైల్వేకి నిధులు కేటాయించాల్సి ఉంది. గుంతకల్లు డివిజన్‌కు ఏటా అన్యాయమే జరుగుతోందన్న విమర్శ ఉంది. అనేక ఏళ్లుగా కొన్ని పనులు పెండింగులోనే ఉంటూ వస్తున్నాయి. వాటికి ఈసారి అయినా మోక్షం కల్పించాలని జిల్లావాసులు కోరుతున్నారు.



నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

అభివృద్ధి పథంలో రాష్ట్రం : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్సు స్టేషన్ లో హైదరాబాదుకు నూతన బస్సు సర్వీసులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తోందన్నారు. పోలవరం, రాజధాని అమరావతి పనులను వేగవంతంగా చేపట్టిందని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి తీరుతామని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిన అరాచకాలు, దాడులు అన్నీ ఇన్నీ కాదన్నారు. అనంతరం పెనుకొండ డిపో పరిధి నుంచి గోరంట్ల పెనుకొండ అనంతపురం కర్నూల్ మీదుగా హైదరాబాద్ నూతన బస్సు సర్వీసులను మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా బస్సును మంత్రి నడిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్, పెనుకొండ డిపో మేనేజర్ రామసుబ్బయ్య, మాజీ జడ్‌పిటిసిలు నారాయణస్వామి, మునిమడుగు వెంకటరాముడు, వెంకటరమణ, టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, మండల కన్వీనర్ సిద్దయ్య, మైనార్టీ నాయకులు షౌకత్, వాల్మీకి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి క్యాంపు నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని చిన్మయ విద్యాలయంలో శని, ఆదివారాలలో నిర్వహించే నేషనల్ క్యాడెట్ కార్ప్ (ఎన్.సి.సి.)పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 6వ ఆంధ్రా బెటాలియన్ పరిధిలో గల 20 పాఠశాలల నుండి 650 మంది విద్యార్థిని విద్యార్థులకు సిద్ధాంతపరమైన, ఆచరణాత్మకమైన పరీక్షలు నిర్వహించనున్నారు. చిన్మయ విద్యాలయం పాఠశాల క్రీడా మైదానంలో గుడారాల ఏర్పాటును ఎన్ సి సి అధికారులతో కలిసి విద్యాలయ ఏఎన్ఓలు నవీన్ కుమార్, ఎం. ప్రత్యూష లక్ష్మి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ ఏర్పాట్లకు విద్యాలయ మేనేజ్ మెంట్, ఉపాధ్యాయబృందం సహకారం అందిస్తున్నట్లు పరీక్షల నిర్వహణ అధికారులు తెలిపారు.

కళ్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని 11వ వార్డు మోడల్ కాలనీలోని వ్యాసరాయ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణ నూతనంగా నిర్మించనున్న కళ్యాణ మంటపానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్ రమేష్ రెడ్డి 11వ వార్డు కౌన్సిలర్ అంజలి, ప్రధాన అర్చకులు మహేష్, గురుస్వామి ప్రభాకర్ ఆచారి, కమిటీ సభ్యులు శ్రీనివాస్, నాగేంద్ర, శివప్ప, జగప్ప, మంజు తదితరులు పాల్గొన్నారు.

డెత్ సర్టిఫికెట్ మంజూరులో జాప్యం

సచివాలయం ముందు పురుగుల మందు సీసాతో బాధితుల నిరసన
గ్రామకార్యదర్శి నిర్లక్ష్యం చేస్తున్నాడంటూ ఆవేదన



పురుగుల మందు సీసాతో సచివాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి-పెనుకొండ

మరణ ధ్రువీకరణ పత్రం కోసం సచివాలయం ముందు బాధిత కుటుంబం పురుగుల మందు సీసాతో బాధిత కుటుంబం నిరసన చేపట్టింది. మండల పరిధిలోని మావటూరులో శుక్రవారం చోటుచేసుకున్న ఈఘటనకు సంబందించి బాధితులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి అనే రైతు గత ఏడాది నవంబర్‌నెలలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ రైతు డెత్ సర్టిఫికెట్ కోసం అతని తండ్రి గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే డెత్ సర్టిఫికెట్ మంజూరులో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీరాములు అలసత్వం వహించాడు. సుధాకర్‌రెడ్డి డెత్ సర్టిఫికెట్ ఇస్తే అతను తాకట్టుపెట్టిన బంగారం బ్యాంకు నుంచి విడిపించుకోవాలని తలంచారు. ఇన్సూరెన్స్ కంపెనీ వారు కూడా జనవరి నెలలోపు డెత్ సర్టిఫికెట్ ఇస్తే డబ్బులు వస్తాయి లేకపోతే రావని చెప్పారు. దీంతో మృతుడు సుధాకర్ రెడ్డి తండ్రి రఘు రామిరెడ్డి ప్రతి రోజు సచివాలయానికి వస్తున్నా పట్టించుకోలేదు. ఆస్తమాతో ఇబ్బంది పడుతున్న రఘురామిరెడ్డి సచివాలయం చుట్టూ తిరిగి అలసిపోయాడు. విషయాన్ని ఎంపిడిఒ కార్యాలయానికి ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశాడు. అప్పటినుంచి కార్యదర్శి మరింత ఇబ్బంది పెట్టడం ప్రారంభించాడు. 'ఎంపిడిఒ దగ్గరే సర్టిఫికెట్ ఇప్పించుకోండి, మీకిష్టం వచ్చిన చోట చెప్పుకోండి' అంటూ బెదిరించాడు. దీంతో విసుగు చెందిన బాధిత కుటుంబసభ్యులు శుక్రవారం గ్రామ సచివాలయం వద్దకు వచ్చారు. పురుగులమందు సీసా చేత పట్టుకుని సచివాలయం ముందు ఆందోళనకు దిగారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డెత్‌సర్టిఫికెట్ మంజూరు చేయాలని లేకుండా కుటుంబసభ్యులందరూ కలిసి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంపై కార్యదర్శి మాట్లాడుతూ డాక్యుమెంట్లు సబ్‌మిట్ చేయడంలో జాప్యం జరిగిందని వారంలోపు సర్టిఫికెట్ మంజూరు చేస్తామని చెప్పారు.

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. ముందుగా కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ సమస్యలపై కౌన్సిలర్లతో చర్చించారు. చర్చ ప్రారంభ దశలోనే టిపిఒ సాయిప్రసాద్ భవన నిర్మాణాల అనుమతుల విషయంలో ప్రజల నుంచి లంచాలు తీసుకుంటున్నట్లు ఆధారాలతో సహా కౌన్సిలర్లు రుజువు చేశారు. దీంతో టిపిఒను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని కోరుతూ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఫ్లెక్సీల ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంపై వైసిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు కౌన్సిలర్లు మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్ల వివరాలు ప్రజలకు తెలియక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డివైడర్ల మధ్యలో మొక్కల సంరక్షణను వదిలేశారన్నారు. వీధిలైట్ల, పారిశుధ్యం సమస్యలు ఉన్నాయన్నారు. స్పందించిన ఛైర్‌పర్సన్ ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టిపిఒ సాయి ప్రసాద్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ వేముల జయరామిరెడ్డి, శంషాద్ బేగం, కో ఆప్షన్ సభ్యులు భూశెట్టి రామకృష్ణ, మెప్మా టిపిఒ విజయభాస్కర్, మున్సిపల్ మేనేజర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సభ్యులు



విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న న్యాయవాదులు, తదితరులు

బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి-హిందూపురం

బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని మాజీ ప్రభుత్వ న్యాయవాది సుదర్శన్, న్యాయవాదులు కళావతి, సంతోషి కుమారి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలికా సదనంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్లల విద్యాభివృద్ధి కోసం ఎన్నో రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయనివాటిని సద్వినియోగం చేసుకుంటూ చక్కగా చదువుకోవాలని కోరారు. తల్లితండ్రులు తమకు ఎన్ని కష్టాలు ఉన్నా పిల్లల విద్యాభ్యాసం పట్ల నిర్లక్ష్యం చేయకుండా విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ పనుల్లోకి పంపకుండా పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. భాగంగా విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలికా సదనం ఇన్‌ఛార్జి రహమతీయ, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-హిందూపురం

వాహనదారులు రహదారి భద్రతా నియమాలను తప్పక పాటించాలని జిల్లా రవాణాశాఖ కార్యాలయం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఉదయ్ నాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక ఎన్ఎస్ పి ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రహదారి భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. వెంకటేసులు మాట్లాడుతూ, సెల్ పోన్ మాట్లాడుతూ అజాగ్రత్తతో ద్విచక్ర వాహనం నడపడం వల్ల ప్రమాదాల బారినపడి తల్లిదండ్రులకు శోకం మిగిలే పరిస్థితి వస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఉదయ నాయుడిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రంగనాయకులు, అధ్యాపకులు, సీనియర్ అసిస్టెంట్ బి నరసింహులు, రవాణా



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎంవిఐ ఉదయ్ నాయుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రభుత్వాసుపత్రి పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లాస్థాయి హోదా కలిగిన హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో ఆసుపత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత 16 సంవత్సరాల నుండి ప్రభుత్వాసుపత్రిలో పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారన్నారు. అయితే వీరికి ఇప్పటికీ కేవలం రూ. 15 వేల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఆసుపత్రిలో 35 నుండి 40 మంది చేయాల్సిన పనిని కేవలం 24 మందితోనే చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పని భారం ఎక్కువై కార్మికులు అనేక సందర్భాల్లో కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం ప్రయోజనం లేకపోయిందన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో పనిచేస్తున్న 24 మందికి ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. ఈ విషయాన్ని ఆసుపత్రి అధికారుల దృష్టికి తీసుకెళితే కాంట్రాక్టర్ తో మాట్లాడుకోవాలని చెబుతున్నారన్నారు. ఆసుపత్రిలో వ్యర్థాలు వేసేందుకు 5 డబ్బాలకు గాను కేవలం రెండు డబ్బాలు మాత్రమే ఉన్నాయన్నారు. తమకు ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు కనీసం రూ. 26 వేల వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, విధి నిర్వహణలో ఉన్న కార్మికులకు భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. దీనికి తోడు అదనంగా కార్మికులను పనిలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు హిందూపురం పట్టణ కన్వీనర్ వీఆర్ రాము, సీనియర్ నాయకులు కల్లూరు రాజప్ప, యూనియన్ కార్యదర్శి నాగరాజు, అధ్యక్షులు గంగాధర్, కోశాధికారి అమర్, కమిటీ సభ్యులు నరసింహప్ప, జాఫర్, ఆది, గంగాధరప్ప, హరికృష్ణ, రత్నమ్మ, అంజలి, వేణి, అంజనమ్మ, లలితమ్మ, పద్మ, కృష్ణవేణి, షాహిన తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, పారిశుధ్య కార్మికులు

నారాయణ విద్యాసంస్థలపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, వైఎస్ఆర్ఎస్‌యు ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైందని జెఎసి నాయకులు బాబ్‌జాన్ తెలిపారు. ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నారాయణ స్కూల్ ముందు గొంతుకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని, నారాయణను మంత్రివర్గ నుంచి తొలగించాలని, లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాబ్‌జాన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శేషం మహేంద్ర, వైఎస్ఆర్ఎస్‌యు నాయకులు చల్లా చంద్రశేఖర్, గణేష్, అఖిల్, బన్నీ, అరుణ్, శ్రీకాంత్, భాను, సాయికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిర : విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన నారాయణ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అనంతపురంలోని నారాయణ కళాశాల యాజమాన్యంతో పాటు నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, లేనిచో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.

కొత్తచెరువు : ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై వేధింపులకు పాల్పడటాన్ని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పోతలయ్య, వైఎస్ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షులు పురుషోత్తం ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలి లో మోకాళ్లపై నిల్చొని నిరసన చేపట్టారు. వారు మాట్లాడు తూ విద్యార్థి ఆత్మహత్యకు కాణమైన నారాయణ విద్యాసంస్థల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా ఆందోళనలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు కానీ పోలీసు యంత్రాంగం గాని నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇదే విషయం పై నారాయణ కళా శాల వద్ద విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టగా విద్యార్థి నాయకులను అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి నారాయణ కళాశాల యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవమరించిన విద్యాశాఖ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తక్షణమే విద్యాదీవెన, వసతిదీవెన బకాయి లు విడుదల చేయాలని కోరారు. ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం జిల్లావ్యాప్తంగా కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చామని, జిల్లాలోని విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, ఎస్.విష్ణువర్ధన్, ఎఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్‌రెడ్డి, హరిప్రసాద్, గౌతమ్ పాల్గొన్నారు.



కదిరిలో గొంతుకు ఉరి తాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

హిందూపురం : అనంతపురంలోని నారాయణ కళాశాల విద్యార్థి ఆత్మహత్యపై ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు బాబావలి, చంద్రశేఖర్ రెడ్డి, కదిరిష్, చంద్రశేఖర్ రెడ్డి శివకుమార్, మనోజ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థి మరణంపై సమగ్రమైన విచారణ చేయాలని, నారాయణ కళాశాలను సీజ్ చేయాలని మంత్రి నారాయణను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు లిఖిత్, నరసింహమూర్తి, దివాకర్ రెడ్డి, సల్మాన్, సందీప్, పవన్, అఫ్రిద్, వెంకటేష్, ఇనాం, గోపి, నూర్, భరత్, ఆమోన్, నరేంద్ర, చరణ్ నితిన్, హరీష్, ముక్తదీర్, వలీసాబ్, సాకిబ్ తో పాటు పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పురంలో బంద్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

తూతూమంత్రంగా మండల సమావేశం

సగంమంది అధికారులు, సభ్యులు గైర్హాజరు

ప్రజాశక్తి-అగళి

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రేణుక కామరాజు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. మండలంలో 14 శాఖలు ఉండగా 7 శాఖల నుంచి మాత్రమే అధికారులు హాజరయ్యారు. వారిలోనూ మండల స్థాయి అధికారులు కాకుండా కింది స్థాయి సిబ్బంది, అసిస్టెంట్లు హాజరయ్యారు. ఇక సభ్యులు కూడా సగం మందికి పైనే గైర్హాజరు కావడం గమనార్హం. ఉదయం 10:30 గంటలకు జరగాల్సిన సమావేశం 12 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1.30 గంటలకు పూర్తయింది. అధికారులు కేవలం వారి వారి శాఖల నివేదికలను చదివి వినిపించారు. కొందరు అధికారులు సమావేశం పూర్తికాకుండానే బయటకు వెళ్లిపోయారు. సమావేశంలో జడ్పిటిసి ఉమేష్, ఎంపీడీవో యాదవేంద్ర, తహశీల్దార్ సుబ్బారావు, ఉపాధి హామీ ఎపిఒ శివన్న, ఎంఇఒ, పిహెచ్‌సి వైద్యాధికారి, వ్యవసాయ అధికారి శేఖర్‌నాయక్, అంగన్వాడీ సూపర్వైజర్ లీలావతి, వార్డెన్ ఖాదర్ వలి, కొందరు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



మండల సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జిని కలిసిన ఎపిడబ్ల్యుజెఎఫ్ కమిటీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఎపిడబ్ల్యుజెఎఫ్ డివిజన్, పట్టణ నూతన కమిటీ సభ్యులు శుక్రవారం మంత్రి సత్యకుమార్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ ధర్మవరం డివిజన్ అధ్యక్షులు మురళీగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పతకమూరి నాగభూషణ ఆధ్వర్యంలో హరీష్‌బాబుకు పూలబొకేలు ఇచ్చి, శాలువాలతో సన్మానించారు. హరీష్‌బాబు మాట్లాడుతూ పాత్రికేయులు కలిసి మెలిసి ఉండాలని సూచించారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డివిజన్, పట్టణ కమిటీ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు నాగరాజు, సహాయ కార్యదర్శి అబ్దుల్లా, కోశాధికారి భీమనేని వెంకటేశ్వరచౌదరి, ప్రచార కార్యదర్శి జ్వాల ప్రసాద్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మజ్జిగ భాస్కర్, ఉపాధ్యక్షులు రాచర్ల మల్లికార్జున, ఆంజనేయులు గౌడ్, రవికుమార్, కార్యవర్గ సభ్యులు శివ, చెన్నప్ప, నాయకులు డోలా రాజారెడ్డి, రవీందర్‌రెడ్డి, జింకా రామాంజనేయులు, చంద్ర పాల్గొన్నారు.

దరఖాస్తుదారులందరికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

దరఖాస్తు చేసుకున్న ప్రతిరైతుకీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనందంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి అమరాపురం మండలంలోని శివరం గ్రామం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన సబ్‌స్టేషన్ ఛార్జ్ చేయడానికి వచ్చిన జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్, హిందూపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు ఆయన వినతి పత్రాలు ఇచ్చారు. ప్రతి రైతుకూ యుద్ధ ప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రిని అందించాలని ఆయన కోరారు. నిర్మాణం పూర్తయిన శివరం, వైబిహళ్లి సబ్‌స్టేషన్లను వెంటనే ఛార్జ్ చేయాలని డిమాండ్ చేశారు. అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను పగటిపూటే 9 గంటలు ఇవ్వాలని కోరారు. లో వోల్టేజీ, సరఫరా సమస్యలను 4 రోజుల్లో పరిష్కరిస్తామని ఎస్ఈ, ఈఈలు హామీ ఇచ్చారు. ఆయనతో పాటు రైతు ప్రతినిధులు దశరథరెడ్డి, నాగభూషణ్, రంగధాంరెడ్డి, దేవరాజ్ ఉన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

ప్రజాశక్తి-మడకశిర


ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని మాజీ మంత్రి, సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న డ్రైవర్ రిజ్వానుల్లా శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఎన్ఎంయుఎ జోనల్ కోశాధికారి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో సన్మానసభ ఏర్పాటు చేయగా రఘువీరా ఆయనను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎంయుఎ జోనల్ కార్యదర్శి ఎం.చెన్నారెడ్డి, కార్యదర్శి టి.షబ్బీర్, డిపో అధికారులు సుబ్బరాయప్ప, లక్ష్మీకాంతం, డిపో కమిటీ నాయకులు రామకృష్ణ, జయసింహ, ముద్దప్ప, రఫీక్, సహ ఉద్యోగులు పాల్గొన్నారు.




ఆర్టీసీ డ్రైవర్ ఉద్యోగ విరమణ సభలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

గుడిబండ : మండలంలోని ఎస్.రాయాపురం గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కరియప్ప ఉద్యోగ విరమణ పొందారు. దీంతో పాఠశాలలో ఉపాధ్యాయులు ఆయనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా డిఆర్‌డిఎ వెలుగు పిడి నరసయ్య, ఎంఇఒలు గంగప్ప, రవిచంద్రకుమార్ హాజరై కరియప్ప దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామసులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక వడ్డిపేట పాఠశాలలో హెచ్ఎంగా పని చేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన నరసింహులును ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒలు వేమనారాయణ, రమణప్ప, ఉపాధ్యాయులు ఫక్రుద్దీన్, నాయుడు, ఈశ్వరయ్య, నాగరాజు, నాగేంద్ర, రామాంజనేయులు, సత్యనారాయణ, అరుణ, కుమారి, రఫీ, నారాయణస్వామి, రంగనాథ్ పాల్గొన్నారు.



కరియప్ప దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు.



ముదిగుబ్బలో నరసింహులు దంపతులను సన్మానిస్తున్న ఎంఇఒ వేమనారాయణ, ఉపాధ్యాయులుల

అమరాపురం తహశీల్దార్‌గా లక్ష్మీనరసింహ

ప్రజాశక్తి-మడకశిర



అమరాపురం మండల నూతన తహశీల్దార్‌గా లక్ష్మీనరసింహ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మడకశిర తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న లక్ష్మీనరసింహకు ఉన్నతా ధికారులు అమరాపురం మండల ఎఫ్ఎసి బాధ్యతలు కేటాయించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

ముగిసిన పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని పాయికట్టు, బొలుగుట్ల వారిపల్లి, తదితర గ్రామాల్లో శుక్రవారం నాటితో పశువైద్య శిబిరాలు ముగిసినట్లు పశువైద్యాధికారి బి.చెన్నకేశవనాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ శిబిరాల్లో పశువులకు వైద్య సేవలతో పాటు నట్టల నివారణ మందులు, టీకాలు వేయించామన్నారు. పాడిరైతులకు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సాయికుమార్ నాయక్, పాడి రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్ దృష్టికి రేషన్ డీలర్ల సమస్యలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ స్వర్ణలత డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పలువురు డీలర్లు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ముఖ్యంగా 50 కిలోల బస్తాలో 44 నుంచి 46 కిలోల బియ్యం మాత్రమే ఉంటున్నాయని, బియ్యం బస్తాలను దింపే కూలీలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, బఫర్ స్టాక్‌ను ఇప్పటివరకూ పరిష్కరించలేదని విన్నవించారు. ఆయా సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తహశీల్దార్ స్వర్ణలత, సిఎస్‌డిటి రామకృష్ణ హామీ ఇచ్చారు.

ఫీజురీయింబర్స్‌మెంట్‌పై మాట్లాడే అర్హత వైసిపికి లేదు


ప్రజాశక్తి-గుడిబండ

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మాట్లాడే అర్హత వైసిపికి లేదని నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు జవనడుకు రంగ తెలిపారు. జగన్ హయాంలో వైసిపి ప్రభుత్వం విద్యార్థులను దగా చేసి నేడు కపటనాటకాలు ఆడుతూ ఫిబ్రవరి 5వ తేదీ 'ఫీజు పోరు' కార్యక్రమం చేపట్టడం సిగ్గుచేటు అన్నారు. ఇకనైనా వైసిపి నాయకులు నాటకాలు ఆడటం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

ప్రయివేటు ఆసుపత్రుల తనిఖీ

ప్రజాశక్తి-ధర్మవరంటౌన్

ప్రయివేట్ హాస్పిటల్స్ విధిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆర్డీవో మహేష్ ఆదేశించారు. ఆర్డీవో శుక్రవారం డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వియా సాల్మన్‌తో కలిసి పట్టణంలోని దేవి నర్సింగ్ హోం, విజయలక్ష్మి, స్పందన ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ చేయరాదన్న నోటీస్ బోర్డును ఆసుపత్రి వెలుప తప్పకుండా ఉంచాలని ఆదేశించారు. రోగులకు నాణ్యతతో కూడిన వైద్య సేవలు అందించాలన్నారు.



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ మహేష్

5న వైసిపి ఫీజు పోరు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్ర వరి 5వ తేదీ వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన 'ఫీజుపోరు' కార్యక్రమాన్ని జయప్రదం చేయా లని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో కేతిరెడ్డి 'ఫీజుపోరు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సకాలంలో విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 5వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లకు డిమాండ్ పత్రాలు ఇస్తామన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకూ వైసిపి పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు పురుషోత్తం, అమర్‌నాథరెడ్డి, పట్టణ నాయకులు సి.నారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాసులు, సాయికుమార్, పి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఫీజుపోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కేతిరెడ్డి, నాయకులు

పౌరహక్కులపై అవగాహన



పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొన్న ఆర్‌డిఒ సువర్ణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని పెడపల్లిపెద్దతండాలో శుక్రవారం ఆర్డీవో సువర్ణ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఆర్డీవోతో పాటు రూరల్ ఎస్ఐ లింగన్న, డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ గ్రామస్తులకు సివిల్ రైట్స్ డే, పౌర హక్కులతో పాటు పలు విషయాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో పౌర హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దళిత, గిరిజనుల హక్కులను వివ రించారు. గిరిజన, దళిత కాలనీల్లో సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుం టామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి శ్రీరామ్‌నాయక్ పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మండలంలోని తుంపర్తి గ్రామంలో డిప్యూటీ తాహశీల్దార్, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు ఉంటుందని, పౌర హక్కులకు భంగం కలిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ పోలీసులు, కూటమి నాయకులు నాగిరెడ్డి, నాగరాజురెడ్డి, విఆర్ఒ, ప్రజలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయించాలే కానీ అనవసరంగా ఎస్సీ, ఎస్టీ చట్టాలను దుర్వినియోగం చేయవద్దని తహశీల్దార్ స్వర్ణలత, ఎస్ఐ సోమశేఖర్, ఈఓఆర్డీ క్రిష్టప్ప సూచించారు. మండలంలోని వెంకటగారిపల్లి ఎస్సీ కాలనీలోని ఆర్‌డిటి కమ్యూనిటీ హాలులో పౌరహక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ముదిగుబ్బ : మండలంలోని సానేవారిపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో రూరల్ సిఐ శ్యామారావు, పట్నం ఎస్ఐ రాజశేఖర్ ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్నం పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

ఎంఇఒ-2 అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లా ఎంఇఒ-2 అసోసియేషన్-2025 క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక డిఇఒ కార్యాలయంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బొల్లె ప్రసాద్ ఆధ్వర్యంలో డిఇఒ జి.క్రిష్టప్ప ఆవిష్కరించారు. డిఇఒ మాట్లాడుతూ ఎంఇఒలు అంకిత భావంతో విధులు నిర్వర్తించి జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గోపాల్‌నాయక్, వెంకటేష్, జయచంద్ర, సంపూర్ణ, రామకృష్ణ, నాగరాజు, రామకృష్ణ, పురుషోత్తం, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని గౌనిపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్, పోక్సో యాక్ట్, ఎమర్జెన్సీ నెంబర్స్, న్యూట్రిషన్ ఫుడ్, చైల్డ్ లేబర్ గురించి వివరించారు. 11-18 ఏళ్ల లోపు బాలబాలికలకు వేర్వేరుగా కమిటీలు వేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రియాజ్, పాఠశాల సిబ్బంది, మహిళా పోలీసు ధనలక్ష్మి, అంగన్వాడీ టీచర్ షమీం, తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

రోడ్డుకిరువైపులా ముళ్లపొదలు తొలగింపు



జెసిబి సాయంతో ముళ్లపొదలను తొలగింప చేయిస్తున్న ఎస్ఐ వెంకటనారాయణ

ప్రజాశక్తి-అమడగూరు

అమడగూరు నుంచి ఒడిసి, కదిరి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలను శుక్రవారం ఎస్ఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో తొలగించారు. ఎస్ఐ మాట్లాడుతూ కొత్తూరు, చెర్లోపల్లి, కసముద్రం వరకూ ప్రధాన రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్లపొదలు, చెట్ల వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. దీంతో పోలీస్ సిబ్బందితో కలిసి కసముద్రం నుంచి చెర్లోపల్లి వరకూ ముళ్లపొదలు, చెట్లను జెసిబితో తొలగించామన్నారు.

వాసవీ మాతకు ఎమ్మెల్యే పట్టువస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో శుక్రవారం మాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో వెలసిన వాసవీ మాత ఆలయంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవంను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్.పార్థసారధి, ఆర్‌డిఒ వివిఎస్ శర్మ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, సభ్యులు వంశీకృష్ణ పాల్గొన్నారు.

నల్లచెరువు : నల్లచెరువులో స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి మాత ఆలయంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం సీతారాముల ఆలయానికి రూ. 5 లక్షల విరాళం ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట ఆలయ కమిటీ సభ్యులు నగేష్‌కుమార్, వెంకటనారాయణ, వేమయ్య, ఆంజనేయులు, రామనాథం, ఆర్యవైశ్యులు నగేష్, రవి, నాగరాజు ఉన్నారు.

తనకల్లు : స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన ఆత్మార్పణ దినోత్సవం పూజల్లో ఎమ్మెల్యే కందికుంట పాల్గొన్నారు. త్వరలోనే ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ. 140 కోట్లు విడుదల చేస్తున్నామన్నారు. పేద ఆర్యవైశ్యులకు సబ్సిడీ రుణాలు అందిస్తామన్నారు. ఆర్యవైశ్యుల కోరిక మేరకు వెంటనే శ్మశానవాటిక నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే ఎంపీడీవోను ఆదేశించారు. పేద ఆర్యవైశ్యులకు త్వరలోనే ఇంటి పట్టాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యల సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, సభ్యులు నాగేంద్రప్రసాద్, సతీష్, అనిల్, నగేష్, టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, కావడి ప్రవీణ్‌కుమార్, సోంపాలెం నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని తేరు బజార్‌లో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరిగిన ఆత్మార్పణ దినోత్సవంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ్ మాట్లాడుతూ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి నాయకులు సందా రాఘవ, ఫణికుమార్, కేశగాళ్ల శ్రీనివాసులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి మండల కేంద్రాల్లోని అమ్మవారి ఆలయాలకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహా కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, నాయకులు మహేష్, వెంకట నారాయణ, గంగాధర్, పార్థసారధి, తల్లం మల్లికార్జున, నారాయణ, మధుబాబు, సుధాకర్, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ముందుగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలో బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, కాపు బలిజలకు స్వయం ఉపాధి పొందడానికి 13 యూనిట్లు మంజూరయ్యాయని, ఫిబ్రవరి 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు మున్సిపాలిటీలోని మెప్మా విభాగంలో సంప్రదించాలన్నారు.

కొత్తచెరువు : బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నటరాజు తెలిపారు. మండల వ్యాప్తంగా 46 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. మరిన్ని వివరాలకు సచివాలయంలో సంప్రదించాలన్నారు.

కదిరి టౌన్ : రాయితీ రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ పోలప్ప తెలిపారు. మండల వ్యాప్తంగా బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్ల ద్వారా మొత్తం యూనిట్లు 43 మంజూరయ్యాయని, మరిన్ని వివరాలకు ఎంపిడిఒ కార్యాలయం, సచివాలయంలో సంప్రదించాలన్నారు.

రీ సర్వే సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలో భూముల రీసర్వే పైలెట్ ప్రాజెక్టు అమలు అవుతోందని, రైతుల సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. సందేహాలు, సర్వే పనులపై రైతులు 9441688647కు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5గంటల లోపు ఫోన్ చేయాలన్నారు.

నేడు కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

రొద్దం : మండలంలోని చోలేమర్రి గ్రామంలో శనివారం మంత్రి సవిత కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని టిడిపి మండల కన్వీనర్ నరహరి తెలిపారు. అలాగే మంత్రి సవిత ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని, కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

రౌండ్ టేబుల్ వితరణ

నంబులపూలకుంట : మండలంలోని రెడ్డివారిపల్లి గ్రామంలో ఉన్న భవిత కేంద్రానికి శుక్రవారం బిజెపి మైనార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్, మండల అధ్యక్షుడు షేక్ బాబ్‌జాన్ రూ. 12 వేల విలువ చేసే ఓ రౌండ్ టేబుల్‌ను అందజేశారు. పుట్టిన ఊరు, మండలానికి తన వంతుగా సేవ చేస్తానని బాబ్‌జాన్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రామ్మోహన్, మండల మైనార్టీ మోర్చా అధ్యక్షుడు చాంద్‌బాషా పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి మందులు అందజేత

లేపాక్షి : స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన నరసింహమూర్తి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. టిడిపి మండల కన్వీనర్ జయప్ప ద్వారా ఈ విషయం తెలుసుకున్న వీరభద్రాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కరణం రమానందన్ రూ. 42 వేల విలువైన మందులను శుక్రవారం నరసింహమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌కుమార్, దుర్గా, నాని పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ఎన్‌టిఆర్ వైద్య శిబిరం

లేపాక్షి : ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని పి.కొత్తపల్లి గ్రామంలో ఎన్‌టిఆర్ ఆరోగ్యరథం సభ్యులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో వంద మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయక్రిష్ణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

3 నుంచి పింఛన్ల పరిశీలన

గాండ్లపెంట : ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకూ మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పరిశీలిస్తారని ఎంపీడీవో వెంకట రామిరెడ్డి తెలిపారు. 3న గాండ్లపెంట, కటారుపల్లి, గొడ్డువెలగల, 4న కురుమామిడి, వేపరాల, 5న సోమయాజులపల్లి, మల్లమీదపల్లి చేపడతారన్నారు.

మలకవేముల ఆసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని మలకవేముల క్రాస్‌లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం జోనల్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ లక్ష్మినాయక్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి పరిధిలో మలేరియా, డెంగీ, తదితర కేసులపై ఆరా తీశారు. ఆయన వెంట డాక్టర్ లక్ష్మి, సబ్ యూనిట్ అధికారి దేవల నాయక్, వైద్య సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మి నరసమ్మ, నిత్య పూజయ్య, సబ్ యూనిట్ సూపర్‌వైజర్ శశిధర్, రవిశంకర్, భార్గవి, జ్యోతి, శైలజ, మీనా, వినయ్ కుమార్, మహబూబ్‌బాషా, గంగాదేవి, హరినాథ్‌రెడ్డి ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీ బనాన్‌చెరువుపల్లికి చెందిన మూడే మేఘన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ వలిబాషా తెలిపారు. మూడే మేఘన పొలం వద్ద పశువులు మేపుతుండగా అదే గ్రామానికి చెందిన చలపతినాయుడు ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు కులం పేరుతో దూషించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొందన్నారు. దీంతో అతడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రెండు ఆటోలు ఢీకొనడంతో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మండలంలోని ఓబుళనాయనపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణానికి చెందిన వృద్ధురాలు ఖాజాబీ మరికొందరితో కలిసి ఓబుళనాయనపల్లిలో కూలి పనికి వెళ్లింది. తిరిగి ఆటోలో ఇంటికి బయల్దేరగా ఆ గ్రామం దాటగానే చర్చి వద్ద ధర్మవరం వైపు నుంచి దర్శనమల గ్రామం వెళ్లే మరో ఆటో వీరి ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఖాజాబీ కాలుకు తీవ్రమైన గాయం కావడంతో తోటి కూలీలు ఖాజాబీని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖాజాబీని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.